అడుగంటిన నీరు



- నెలరోజుల్లో మీటరు లోతుకు పడిపోయిన వైనం
- గంగాధరలో 15.31 మీటర్లు... చొప్పదండిలో 14.81 మీటర్లలో నీరు
- మెట్ట ప్రాంతాల్లో సాగునీటి కష్టాలు
- చి'వరి' తడికి ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎండలు మండిపోతున్నాయి.. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడంతో భూగర్భ జలాలు కూడా వే గంగా పడిపోతున్నాయి. జనవరి మాసంలో జి ల్లాలో 7.01 మీటర్ల లోతున భూగర్భజలాలు లభ్యం కాగా ఇప్పుడు సగటున 8.10 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఏప్రిల్ చివరి వరకు సగటున మరో మీటరు లోతుకు నీరు పడిపోయే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మూడు మాసాల్లోనే భూగర్భజలాలు మీటరు లోతుకు పైగా పడిపో వడంతో మెట్ట ప్రాంతాల్లో ఇప్పటికే బోరుబావులన్నీ ఎండిపోతున్నాయి .జిల్లాలో 2,65,000 ఎకరాల్లో వరి సాగు చేయగా ఉగాది నుంచి కోతలు మొదల య్యాయి. మే మొదటి వారం వరకు కూడా కోతకు వచ్చే పొలాలు ఎన్నో ఉన్నాయి. శ్రీరాంసాగర్ ప్రా జెక్టు ఆయకట్టుకు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6 వరకే నీటి విడుదల చేశారు. కోతకు వచ్చిన పొలాలు పోను సుమారు లక్ష ఎకరాల పొలాలకు కొన్నింటికి ఒక తడి మరికొన్నిటికి రెండు తడులు నీరు ఇవ్వాల్సిన అవసరమున్నది. ఈసారి వర్షాకాలంలో సాధారణ వర్షపాతం నమోదై నప్ప టికీ సాగునీరు విస్తీర్ణం పెరిగింది. ఎండలు పెరుగడంతో బోరు బావుల ద్వారా పంట పొలాలకు నీరందించాల్సిన అవసరం ఏర్పడింది. ఏప్రిల్‌లోనే ప్రస్తుత గడ్డు పరిస్థితి ఉండగా మే నెలలో మరింత నీటి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు.

● 70శాతం బోరుబావులతోనే సాగు

జిల్లాలో 1.09 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉండగా ఇందులో 70శాతం బోరుబావులే ఉన్నాయి. బోరుబావులతో చివరి తడికి నీరు ఇవ్వ వచ్చని ఆశిస్తున్న రైతులకు వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎస్సారెస్పీ మరో రెండు తడులకు నీరు ఇవ్వాలనే డిమాండ్ పలు మండలాల నుంచి వస్తున్నది. ప్రస్తుతం జిల్లాలోని గంగాధర మండలంలో భూగర్భ జలాలు అత్యధిక లోతునకు పడిపోయాయి. ఈ మండలంలో భూగర్భజలాలు 15.31 మీటర్ల లోతుకు చేరాయి. చొప్పదండి మండలంలో 14.81 మీటర్ల లోతుకు, కరీంనగర్ అర్బన్ మండలంలో 10.60 మీటర్లకు, రామడుగు మండలంలో 11.10 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి. గన్నేరువరం మండలంలో 9.71, కొత్తపల్లి మండలంలో 9.32, తిమ్మాపూర్ మండ లంలో 8.82, హుజురాబాద్ మండలంలో 8.88, చిగురుమామిడి మండలంలో 8.27 మీటర్ల లోతుకు నీరు పడిపోయింది. సైదాపూర్ మండ లంలో భూగర్భ జలాలు 6.13 మీటర్ల లోతుకు ఉన్నాయి. జిల్లాలోని మిగతా అన్ని మండలాల్లో 5 మీటర్లలోతులోనే భూగర్భ జలాలు లభిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో తగ్గిపోతున్న భూగర్భ జలాలు రైతన్నలకు ఆందోళన కలిగిస్తున్నాయి. మెట్ట ప్రాంతాలకు కొంత ఇబ్బంది తప్పక పోయినా కనీసం ఆయకట్టు ప్రాంతంలో మరో తడికి అదనంగా నీరు ఇచ్చి వరి పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ పమేలాసత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం ఆధ్వ ర్యంలో వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకొని చదువులో రాణిం చాలని కలెక్టర్ పమేలాసత్పతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పిలుపు నిచ్చారు. మంగళవారం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల సహకారంతో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒలంపియాడ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ పరీక్ష రాసి మెరిట్ సాధించిన విద్యార్థులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మెడల్స్, సర్టిఫికెట్స్‌ను కలెక్టర్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆల్ఫోర్స్ విద్యాసంస్థ 400 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒలంపియాడ్‌లో శిక్షణ ఇచ్చిందని అన్నారు. వీరిలో 80 మంది మెరిట్ సాధించగా, 16 మందికి మెడల్స్‌వచ్చాయని, మెరిట్ సాధించిన 80 మంది విద్యార్థులకు ఈనెల 24 నుండి మరో విడత శిక్షణ ఉంటుందని చెప్పారు. అవకాశం, వేదిక ఇస్తే ప్రభుత్వ పాఠశాలల్లోని ఎంతో మంది పిల్లలు విజయం సాధిస్తారని నిరూపితమైందని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్‌రెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

పౌష్టికాహార ప్రాముఖ్యతపై ఈ నెల 22 వరకు నిర్వహించనున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్ సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు, వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్య క్రమా లను నిర్వహించాలని అన్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్‌గార్డెన్లను ఏర్పాటు చేయాలని, పోషకాహార వంటల పోటీలను నిర్వహించాలని సూ చించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ గర్భిణీగా ఉన్నప్పటి నుంచి శిశువు జన్మించిన తర్వాత గల వేయి రోజుల ప్రాము ఖ్యతను ప్రజలకు వివరించాలని అన్నారు. అనంతరం పోషణ పక్షం పో స్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధి కారి స బిత, మెప్మా పీడీ వేణుమాధవ్, డిటిడివో పవన్‌కుమార్, జిల్లా వైద్యా దికారి వెంకటరమణ, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాశ్ పాల్గొన్నారు.

ఉద్రిక్తంగా సీపీఐ ధర్నా

- అడ్డుకున్న పోలీసులు



సీపీఐ నాయకులు, పోలీసుల తోపులాట
గాయపడ్డ సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు

భగత్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తంగా మారింది. మంగళ వారం నగరంలోని కమాన్ చౌరస్తాలో వంటగ్యాస్ ధరలు పెంచ డాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీపీఐ నాయకులు, పోలీసులకు జరిగిన తోపులాటలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు తలకు గాయ మై రక్తస్రావమైంది. తోపులాటతో కొంత మంది కిందపడగా గాయాల య్యాయి. ఆందోళనతో కమాన్‌చౌరస్తా ప్రాంతంలో వాహనాలు నిలిచిపోయాయి.

వంటగ్యాస్ ధరలు పెంచి పేదలపై భారం మోపిన కేంద్రం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ అయిల్ ధరలు తగ్గినా కేంద్రం చమురు ధరలను తగ్గించకుండా ఆయిల్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. అర్ధరాత్రి వంటగ్యాస్ 50 రూపాయలు పెంచి పేదలపై భారం మోపి పెట్రోల్, డీజిల్‌పై రెండు రూపాయలు పెంచి వీటిని కంపెనీలే భరించాలని కేంద్ర మంత్రి ప్రకటించడం దుర్మార్గమన్నారు. మోదీ ప్రభు త్వం 11 సంవత్సరాల్లో పేదలపై అనేక మార్లు భారం మోపిందన్నారు. వంట గ్యాస్ ధరలు తగ్గించాలని శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీ సులు సీపీఐ నాయకులు, కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తించడం సరికాద న్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడుకొయ్యడ సృజన్‌కుమార్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, సాయవేణి రాయమల్లు, బ్రామండ్లపల్లి యుగేందర్, న్యాలపట్ల రాజు,బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థకే కరీంనగర్ ఆదర్శం

- గత ఏడాదిలో 119 కోట్ల నికర లాభం
- రూ.7,300 కోట్ల వ్యాపారం
- కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న
కేడీసీసీ బ్యాంకు చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థకే కరీంనగర్‌కు ఆదర్శం అని కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీతి ఆయోగ్, దేశంలోని అనేక సంఘాలే కాకుండా వివిధ దేశాల నుంచి కూడా బృందాలు చొప్పదండి సహకార బ్యాంకుతోపాటు కేడీసీసీ బ్యాంకును సందర్శించి వ్యాపారం, పరిపాలన తదితర అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారన్నారు. ఒరిస్సా నుంచి ఓ బృందం కరీంనగర్‌కు వస్తుందని తెలిపారు. గత ఏడాది కేడీసీసీబీ 800 కోట్ల వృద్ధితో 7,300 కోట్ల వ్యాపారం చేసి 119 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని చెప్పారు. డిపాజిట్లను 2,530 కోట్ల నుంచి 2,850 కోట్లకు పెరిగాయని, రుణాలను కూడా 3,972 కోట్ల నుంచి 4,458 కోట్లకు అంటే 12.20శాతం పెంచి ఇవ్వడం జరిగిందని చెప్పారు. షేర్ క్యాపిటల్ 188.68 కోట్ల నుంచి 216.21 కోట్లకు పెరిగిందని అన్నారు. జిల్లాలో అన్ని బ్యాంకుల కంటే అధికంగా 1515 కోట్ల పంట రుణాలను అందించామని చెప్పారు. కేవలం రైతులకు పంట రుణాలే కాకుండా ప్రజలకు అవసరమయ్యే అన్ని రకాల ఆర్థిక సహాయాన్ని అందించాలని 152 కోట్ల హౌజ్‌లోన్స్, 61 కోట్ల ఎడ్యుకేషన్ లోన్స్, స్వశక్తి సంఘాలకు 223 కోట్ల రుణాలను ఏడాదిలోనే మంజూరు చేశామని అన్నారు. 98శాతం రుణాలను వసూలు చేశామని, కేడీసీసీబీ ఆధ్వర్యంలో 131 ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘాలు ఉండగా 18 శాఖల్లో నూరు శాతం రుణాలు వసూలయ్యాయని చెప్పారు. 128 సంఘాలు లాభాల్లో నడుస్తున్నాయని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను గతంలో మాదిరిగా ప్యాక్ సంస్థలకు అప్పగించాలని, పెట్రోల్ బంక్ ఫైల్స్‌ను క్లియర్ చేయాలని కోరారు. పెద్దపల్లి కలెక్టర్ నాలుగు సంఘాలకు స్థలాన్ని కేటాయించి సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాట్లుకు సహకరించడం అభినందనీయమని కొనియా డారు. ఈ విలేకరుల సమావేశంలో బ్యాంకు పాలకవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి, సీఈవో, పాలకవర్గసభ్యులు, వివిధ సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

ఘనంగా గరుడవాహన సేవ



ఇల్లందకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ప్రభుత్సోత్సవం అనంతరం గరుడవాహన సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించి గరుడ వాహనంపై అధిరోహించారు. డప్పుచప్పుళ్ల, మేళాతాళాలు, బాజాభజంత్రీలు, వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణ నడుమ హనుమత్ నామస్మరణ చేస్తూ ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ఊరేగించారు.

అంబేద్కర్ జయంతి ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలపై పలు ప్రజా సంఘాల నాయకులు, జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జయంతి ఉత్సవాలపై ఉత్సవ కమిటీ సభ్యులు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాసేవ చేసేవారికి అవార్డులు ఇవ్వాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, సాంస్కృతిక సారథి కళాకారుల బృందం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశం డీఆర్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, ఆర్‌డీవో మహేశ్వర్, ప్రజా సంఘాల నాయకులు, జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పదివేల మంది

- చలో వరంగల్‌ను విజయవంతం చేయండి
- పార్టీశ్రేణులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల పిలుపు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కరీంనగర్ నియోజకవర్గం నుంచి 10వేల మందికి తగ్గకుండా తరలివెళ్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వరంగల్‌లో లక్షలాది మందితో నిర్వహించనున్న పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున పార్టీశ్రేణులు, అభిమానులు, తెలంగాణ ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 2001లో సింహగర్జన పేరుతో కేసీఆర్ మొదటి సమావేశాన్ని కరీంనగర్‌లోనే ఏర్పాటు చేసి టీఆర్ఎస్ పార్టీని స్థాపించి తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష మేరకు తెలంగాణాను సాధించారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. అయితే గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని, మళ్ళీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కమలాకర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కాసారపు శ్రీనివాస్‌గౌడ్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలతమహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ నాయకులు రెడ్డవేణి మధు, జమీలొద్దీన్, సాబీర్ భాష, తోట తిరుపతి, నరసయ్య, గడ్డం ప్రశాంత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువుల్లో చేపల పెంపకం 6

కొనుగోళ్లు లేక తిప్పలు

- కల్లాలలోనే పొద్దు తిరుగుడు పంట
- ఇబ్బందులు పడుతున్న రైతులు

గన్నేరువరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంట పొద్దు తిరుగుడు పండిస్తే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించ వచ్చని కొందరు రైతులు పొద్దుతిరుగుడు సాగు చేశారు. పంట చేతికి రావడంతో ఇప్పుడు విక్రయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గన్నేరువరం మండలంలోని పారువెల్ల గ్రామంలో సుమారు 50 మంది రైతులు వందకు పైగా ఎకరాలలో పొద్దు తిరుగుడు సాగుచేశారు. పంట చేతికి వచ్చి నెల రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి కొనుగోళ్లు లేక కల్లాల వద్దే పంటను ఉం చారు. ధాన్యాన్ని ఎక్కడ అమ్ముకోవాలో తెలి యక రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. కల్లాల వద్ద రాత్రింబవళ్లు రైతులు పడి గాపులు పడుతున్నారు. గతంలో ఉమ్మడి మండలమైన బెజ్జంకి మండల కేంద్రంలో ప్రభుత్వం సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేసింది. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదే శాలు రాలేదని సెంటర్ నిర్వాహకులు కొనుగోలు చేయ డం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పొద్దు తిరుగుడు రైతుల ఆవేదనను గుర్తించి పంటను వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పారువెల్లలో తూకానికి సిద్ధంగా ఉంచిన పొద్దుతిరుగుడు పంట

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం స్పెషల్ టీంతో కలిసి స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్‌లో నిబంధనలు అమ లవుతున్న తీరును పరిశీలించారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994, రూల్స్-1996 అమలు గు రించి తెలుసుకున్నారు. గర్భస్థ శిశవుగా ఉన్నపుడు లింగ నిర్ధారణ చేస్తే పరీక్షలు చేసిన వారికి, చేయించిన వారికి చట్ట ప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించబడుతుందని, అ లాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపే బోర్డులు ప్రదర్శిస్తున్నారా లేదా అని పరిశీలించారు. స్కా నింగ్ సెంటర్లలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతినెలా జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధి కారికి పంపిస్తున్న తీరు, లింగ నిర్ధారణ, పరీక్షలు చట్ట రీత్యా నేరమని, పుట్టబోయే ఆడ మగ, అని చెప్పకూడదని తెలిపే బోర్డులు ప్రదర్శించా లని సూచించారు. ఈ సంద ర్భంగా డీఎం హెచ్‌వో మాట్లా డుతూ స్కానింగ్ సెంటర్లు, ఫెర్టిలిటీ కేంద్రాల తనిఖీ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధి కారి డాక్టర్ సనాజవేరియా, ఏఎస్ఐ విజయమణి, డెమో రాజగోపాల్, డీఈవో రమేశ్, సూపర్‌వైజర్ సయ్యద్‌సాబీర్ తదితరులు పాల్గొన్నారు.



స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

ప్రాణం తీసిన క్రికెట్ బాల్

- చికిత్స పొందుతూ బాలుడి మృతి


అశ్విత్‌రెడ్డి(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బాల్ తగిలి గాయపడిన సంఘటనలో వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతానికి చెందిన దారం అశ్విత్‌రెడ్డి(9) అనే బాలుడు మృతిచెందాడు. గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన దారం శ్రీనివాస్‌రెడ్డి వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్‌లో మందుల దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శ్రీనివాస్‌రెడ్డికి కుమారుడు అశ్విత్‌రెడ్డితో పాటు ఒక కుమార్తె ఉంది. వేసవి సందర్భంగా ఒంటిపూట బడి కొనసాగుతున్న నేపథ్యంలో ఈనెల 3వ తేదీ గురువారం పాఠశాల అయిపోయిన తర్వాత అశ్విత్‌రెడ్డి స్నేహితులతో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఇంటికి తిరిగివచ్చి యథావిధిగా శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. తరగతి గదిలో ఉన్న సమయంలో తలనొప్పిగా ఉందని చెప్పడంతో తండ్రి శ్రీనివాస్‌రెడ్డికి పాఠశాల నిర్వాహకులు సమాచారం అందించారు. అశ్విత్‌రెడ్డిని తండ్రి డాక్టర్ వద్దకు తీసుకువెళ్లగా తలపై క్రికెట్ బాల్ తగిలిందని చెప్పినట్లు సమాచారం. తలలో తీవ్రగాయమై రక్తస్రావం అవుతున్నట్లుగా గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ మేరకు బాలుడు అశ్విత్‌రెడ్డిని కరీంనగర్ తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్ బంజారాహిల్స్ అపోలో ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు శస్త్ర చికిత్స చేసినట్లు బంధువులు తెలిపారు. సోమవారం తిరిగి రెండో శస్త్రచికిత్స నిర్వహించగా మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయి బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సరదాగా క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లి బంతి తగిలి గాయపడిన తమ కుమారుడు మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

మోడల్ స్కూల్లో క్రీడా సామగ్రి చోరీ

గంగాధర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మోడల్ స్కూల్లో క్రీడా సామగ్రి చోరీకి గురైనట్లు ఎస్‌ఐ వంశీ క్రిష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5న పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరాలను పరిశీలిస్తున్న క్రమంలో ఒక కెమెరా పనిచేయకపోవడంతో అక్కడికి వెళ్లి చూడగా కనిపించలేదు. పక్కనే ఉన్న క్రీడా రూంను పరిశీలించగా క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, షటిల్ బ్యాట్లు, గడియారాలు చోరీకి గురైనట్లు తెలిపారు. చోరీకి గురైన క్రీడా వస్తువుల విలువ 15వేలు ఉంటుందని, ప్రిన్సిపాల్ పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మామిడాలపల్లిలో పుస్తెల తాడు..

వీణవంక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన అరవకొండ సరమ్మకు చెందిన 2.5 తులాల పుస్తెలు తాడు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం సరమ్మ ఇంటి ముందు నిద్రిస్తుండగా తెల్లవారుజామున చూసుకునే సరికి పుస్తెలు తాడు మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకొని వెళ్లినట్లు తెలిపారు. సరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామానికి చెందిన సముద్రాల కొంరయ్య వృత్తిరీత్యా సుతారి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనంపై తోకలపల్లి గ్రామ శివారులో రోడ్డు దాటుతుండగా ఓ కారు డ్రైవర్ వచ్చి ఢీకొట్టడంతో తలకు, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన కొంరయ్యను స్థానికులు ఆటోలో హుజూరాబాద్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు కొంరయ్య సోదరుడి కుమారుడు సముద్రాల పవన్‌కల్యాణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నకిలీ ధ్రువీకరణపత్రాల కేసులో యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రం కేసులో మహమ్మద్ యూసుఫుద్దీన్ (37) అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గాలిపెల్లి పశువైద్యశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న దేవమ్మ మెడికల్ ఇన్వాలిడేషన్ సర్టిఫికెట్ సమర్పించగా జిల్లా అధికారులు విచారణ జరిపి నకిలీపత్రాలు అని తేల్చారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా మంగళవారం యూసుఫుద్దీన్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చెరువుల్లో చేపల పెంపకం

- గ్రామాల్లో ఉపాధి పొందుతున్న మత్స్యకారులు
- ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయాలని వేడుకోలు
- చెరువులు, కుంటల్లో నీటిని నింపితే మరింత ఆదాయం

సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గై చెరువులో పట్టిన చేపలు






సైదాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేపల పెంపకంతో గ్రామాల్లోని మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు చెరువుల్లో నీరు లేక చేపల పెంపకం ఆశాజనకంగా లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడం, కాలువ ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరుతోంది. దీనికి తోడు ప్రభుత్వం ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయడంతో మత్స్యకారులు చెరువులు, కుంటలలో చేప పిల్లలు పోసి ఉపాధి పొందుతున్నారు. గత సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా కురియడం వల్ల చెరువులలో నీరు ఎక్కువ కాలం ఉండడంతో చేపలు ఎక్కువ సైజు వరకు పెరిగి ఎక్కువ ఆదాయం వచ్చిందని మత్స్యకారులు చెపుతున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో కురిషిన వర్షాలు ఇప్పటి వరకు లేక పోవడం, ఆ వర్షాలకు చెరువులు పూర్తిగా నిండక పోవడంతో పాటు కాలువ నీరు కూడా అంతంత మాత్రంగా రావడం తో చెరువులు, కుంటల్లో నీరు అంతంత మాత్రంగా చేరింది. నీరు సమృద్ధిగా లేక చేపలు తక్కువ సైజు పెరిగాయని, సుమారు సగం వరకు ఆదాయం తగ్గిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఉచిత చేపపిల్లలు ఇవ్వక పోవడం కూడా ఆదాయం తగ్గుదలకు కారణమని తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి కాలువ నీళ్ల ద్వారా చెరువులు, కుంటలు నింపాలని కోరుతున్నారు. దీంతో మత్స్యకారుల కుటుంబాలు జీవనోపాధి పొందుతాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. అలాగే చేప పిల్లలు కొనడానికే ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తున్నదని, ప్రభుత్వం 100 శాతం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కాలువ నీళ్లతో చెరువులు నింపాలి

సైదాపూర్ మండలంలో 30 గ్రామ పంచాయతీలుండగా 17 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. అందులో 2వేల మంది తమ్మ్యకార సభ్యత్వాలున్నాయి. సుమారు 2వేల పైన కుటుంబాలు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. అయితే సైదాపూర్ మండలానికి ఒక పక్క నుంచి కాకతీయ కెనాల్ ఉన్నది. కొంత భాగానికి మిడ్ మానేరు కాలువ ఉంది. మరికొన్ని గ్రామాలకు గౌరవెల్లి కాలువ వస్తుంది. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కాలువ నీళ్ల సమృద్ధిగా వదిలితే సైదాపూర్ మండలంలో చెరువులు, కుంటలు పూర్తిగా నిండే అవకాశం ఉన్నది. మరోవైపు అన్ని గ్రామాల్లో ప్రతి యేటా ఉచిత చేప పిల్లలను అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.



ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలి

పెసరు కుమారస్వామి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు



ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా కాలువల ద్వారా ఆయా ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలి. దీనితో పాటు ఉచిత చేపపిల్లలు పంపిణీ చేయాలి. ప్రతి గ్రామంలో మత్స్యకార కుటుంబాలు చేపల పెం^పకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. చెరువులు, కుంటలు నింపడం వల్ల మత్స్యకారు లకు చేతి నిండా పని దొరికి ఆర్థి కంగా అభివృద్ధి చేందే అవకాశ ముంది. ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నందికమాన్ సమీపంలో గుర్తుతెలియని వృదురాలు మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. నందికమాన్ సమీపంలోని రోడ్డు పక్కన సుమారు 60 సంవత్సరాల వయస్సుగల, పసుపు పచ్చ చీర, ఎరుపు రంగు జాకెట్ కలిగిన వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు గుర్తించమన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేసి మార్చ్యురీకి తరలించినట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే వేములవాడ టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

కలప పట్టివేత

కొడిమ్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని దమ్మయ్యపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీ అధికారులు పట్టుకున్నారు. అటవీ సిబ్బందికి అందిన పక్కా సమాచారం మేరకు సోమవారం రాత్రి అటవీ శాఖ రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి ట్రాక్టర్‌లో తరలిస్తున్న 35వేల రూపాయల విలువైన 44టేకు దుంగలను పట్టుకున్నారు. డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్, దమ్మయ్యపేట బీట్ అధికారి అశ్విని, బేస్ క్యాంప్ సభ్యులు ఉన్నారు.

బందోబస్తు మధ్య అంత్యక్రియలు

రుద్రంగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్‌తో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత, నిహాల్ తేజ్ అనే తల్లికొడుకుల మృతదేహాలు మంగళవారం రుద్రంగికి చేరుకున్నాయి. దీంతో బంధువులు రోదనలు మిన్నంటాయి. రుద్రంగిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి ఎస్‌ఐ సిరిసిల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ - సిరిసిల్ల జిల్లా కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి వెంటనే పీఆర్సీని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా ట్రెజరీల్లో ఆమోదం పొంది కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్నిబిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. రెండు సంవత్సరాలుగా సెలవు జీతాలు, సప్లమెంటరీ వేతనాలు, మెడికల్‌బిల్లులు జీపీఎఫ్, పెన్షన్ టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత సంవత్సరం మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, కమ్యూనిటేషన్ మొత్తాలను చెల్లించకపోవడం వల్ల పెన్షనర్లు ఇబ్బందులకు గురైతున్నారన్నారు. బకాయి పడిన ఐదు వాయిదాల డీఎలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా పాత విధానాన్ని కొనసాగించడం విచారకరమన్నారు. జీవో 317ను సవరించి బాధితుందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుచేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని, రాష్ట్రంలో అన్ని జిల్లాలకు డీఈవో పోస్టులకు, అన్ని మండలాలకు ఎంఈవోలను నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ దశల వారీగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శులు పాములస్వామి, అడేపు శివకుమార్, తిరపతి, కొత్వాల్ ప్రవీణ్, పోలాస మల్లేశం, కోటగిరి లక్ష్మణ్, మధుసూదన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోరుట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత (20) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఏసీగోన్ని గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత పట్టణానికి చెందిన పవన్‌ను కొన్ని రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకొని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. మంగళవారం రోజు పవన్ తండ్రి అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రంజిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి బయటకు రాకపోవడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఇంట్లోకి వెళ్లి చూడగా రంజిత ఉరివేసుకొని ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


సంధ్యారాణి (ఫైల్)

జైపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీధ ర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన నడిగొట్టు సంధ్యారాణి(40) కుటుంబీకులతో కలిసి మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చింది, కారులో తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద జైపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న వాహనం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సంధ్యా రాణిని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. సంధ్యారాణి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువతిని లైంగికంగా వేధించిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువతిని కులం పేరుతో దూషించి లైంగికంగా వేధించిన కేసులో గోదావరిఖని రాజీవ్‌నగర్‌కు చెందిన ఆవుల మల్లయ్యకు మంగళవారం కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. 2017లో అడ్డగుంటపల్లిలో ఈ ఘటన జరిగిందన్నారు. ఈ కేసు కరీంనగర్‌లోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణ జరుగగా గోదావరిఖని కోర్టు ఏఎస్‌ఐ తిరుపతిరావు, కానిస్టేబుల్ మహేందర్ సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. బాధితురాలి తరపున ప్రభుత్వ న్యాయవాది రాములు నేరం నిరూపించారన్నారు. న్యాయమూర్తి నీరజ తీర్పు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దోషికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బంది, పీపీ రాములును సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ పుల్లా కరుణాకర్, ఏసీపీ రమేష్ అభినందించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

మంథనిరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజు లపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో కాలువ పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలపై మంగళవారం ఉదయం తేనెటీగలు దాడి చేశాయి. కాలువ పూడికతీతలో భాగంగా చెట్లను తొలగిస్తుండగా చెట్లపై ఉన్న తేనే తీగలు ఒక్కసారిగా లేచాయి. కూలీలు అక్కడి నుంచి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తుండగా అవి ఒక్కసారిగా దాడి చేయడంతో 11 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటనలో పేరం దుర్గయ్య, గంగుల స్వామి, తోగరి మల్లయ్య, వేల్పుల రాయలింగు, పేరం లక్ష్మి, నలోటి లక్ష్మి, తోగరి గౌరమ్మ, వేల్పుల లక్ష్మి, వేల్పుల బాను, గోస్కి ఎల్లమ్మ అనే కూలీలకు గాయాలయ్యాయి. వీరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. గాయపడిన ఉపాధిహామీ కూలీలను ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, గొర్కెల సురేష్, మంథని లింగయ్యలు పరామర్శించారు. గాయపడ్డ కూలీలకు మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను వారు కోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

బీర్‌పూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యా యత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందిందని ఎస్సై కుమారస్వామి తెలిపారు. బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన పసుల గంగవ్వ(26)కు రెండు సంవత్సరాల క్రితం తన బావ అయిన తాటిపల్లి మహేందర్‌తో రెండో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొన్ని రోజుల తరువాత జీవనోపాధి నిమిత్తం ముంబాయికి వెళ్లారు. అక్కడ గంగవ్వ కడుపు నొప్పితో బాధపడడంతో స్వగ్రామానికి వచ్చింది.

అయినా నయం కాకపోవడంతో గత నెల 21న క్రిమిసం హారక మందు తాగింది. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ గంగవ్వ మృతి చెందింది. మృతురాలు గంగవ్వ తండ్రి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు కలెక్టర్ చేయూత


క్షతగాత్రుడితో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రెండో బైపాస్ రోడ్డులో మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరికి కలెక్టర్ చేయూత నందించారు. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. చంద్రంపేట శివారులోని రెండో బైపాస్ రోడ్డు జంక్షన్‌లో బైక్, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యు వకులు గాయపడ్డారు. అదే సమయంలో అధి కార పర్యటన నిమిత్తం వెళ్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంఘటనను చూసి తన వాహనాన్ని ఆపారు. గాయపడ్డ యువకులను పరామర్శించి అంబులెన్స్‌లకు సమాచారం అందించి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను ద్విచక్రవాహనంపై తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల-మరిమడ్ల రహదారిపై తనిఖీలు భాగంగా ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 10 లీటర్ల నాటుసారా లభించిందన్నారు. సారాను, రవాణాకు వాడిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకొని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కాంగ్రెస్ జెండా గద్దె ధ్వంసం


జెండా గద్దెను పరిశీలిస్తున్న పోలీసులు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. కాగా కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టిమల్ల చేరుకొని ధ్వంసమైన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను పరిశీలించి సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

చెంజర్లలో పూరిల్లు దగ్ధం

- కాలిబూడిదైన రూ. 1.50 లక్షలు, సామగ్రి

మానకొండూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందజర్లలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఓ పూరిల్లు మంగళవారం దగ్ధమైంది. చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన జ్యోతి-అశోక్ దంపతులకు ఇద్దరు కుమారులు చరణ్, అరవింద్ ఉన్నారు. జ్యోతి, అశోక్ గ్రామంలోని ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తు ఇద్దరు పిల్లలను సాకుతున్నారు. మంగళవారం ఉదయం ఇంటిలో పూజ చేసి దీపం ముట్టించి ఎప్పటిలాగే పనులకు వెళ్లగా కుమారులు పాఠశాలకు వెళ్లారు. వారు వెళ్లిన కొద్ది సేపటికే ముట్టించిన దీపం సమీపంలోని బట్టలకు అంటుకొని పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. నూతన ఇంటి నిర్మాణానికి 1.50 లక్షల రూపాయలను అప్పు తెచ్చి బీరువాలో దాచాగా ప్రమాదంలో బీరువాలోని బట్టలతో పాటు నగదు, 50 కిలోల బియ్యం, వంట సామగ్రి, రెండు మంచాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి.

సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాములు, రికార్డు అసిస్టెంట్ బాబుదేవ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పూరిల్లు దగ్ధం కావడంతో రోడ్డున పడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత దంపతులు కోరారు.


దగ్ధమైన పూరిల్లు వద్ద బాధితులు

ఇస్రో యువికాకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

ఒకే పాఠశాల నుంచి ఇద్దరు



పి.సాత్విక, పి.సిరివెన్నెల, టి.సాయిహర్షిత

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ యేటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యువ శాస్త్రవేత్త కార్యక్రమానికి జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగినేడుకు చెందిన భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు కె.జగదీశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలవేణి సాత్విక, పడాల సిరివెన్నెల, పాలకుర్తి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నాలకు చెందిన భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు బి.రవీనందన్‌రావు మార్గదర్శనంలో తోడేటి సాయిహర్షిత ఎంపికయ్యారు. గతనెలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా ముగ్గురు యువికా 2025కు ఎంపికైనట్లు డీఈఓ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 28రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి వేలాది మంది 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు గత నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారు. రాష్ట్రం నుంచి ఈసారి 12మంది విద్యార్థులు ఎంపిక కాగా ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురు పెద్దపల్లి జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. గతేడాది రాగినేడు ఉన్నత పాఠశాలకు చెందిన రంగు కీర్తన ఎంపిక కాగా ఈసారి అదే పాఠశాల నుంచి ఒకే తరగతికి చెందిన ఇరువురు ఎంపికయ్యారు. ముగ్గురు విద్యార్థులు మే నెలలో ఇస్రోకు చెందిన 7పరిశోధన కేంద్రాల్లో ఒకచోట అంతరిక్ష సాంకేతికత, అనువర్తనాలపై రెండువారాల ఆవాస శిక్షణా కార్యక్రమంలో పాల్గొనున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థినులు శిక్షణకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎంపికైన విద్యార్థినులను, గైడ్ టీచర్లను డీఈవో డి.మాధవితో పాటు డీఎస్‌ఓ సమగ్ర శిక్ష సమన్వయకర్తలు పిఎం.షేక్, సీహెచ్ మల్లేష్‌గౌడ్, కవిత, అజీం, మండల విద్యాధికారులు టి.సురేంద్రకుమార్, టి.విమల, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ఆగయ్య, జె.కమలాకర్‌రావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

సైనిక్ స్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ఎగ్జిబిషన్



స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ బస్ వద్ద విద్యార్థులు

చొప్పదండి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ సైనిక స్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ బస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. జిల్లాలో మొట్ట మొదటిసారిగా రుక్మాపూర్ సైనిక్ గురుకుల స్కూల్‌లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతరిక్ష విజ్ఞానాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్న లక్ష్యంతో ఎన్‌ఆర్‌ఎస్‌సీ సంస్థ స్పేస్ ఆన్ వీల్స్‌ను నిర్వహిస్తున్నారు. అంతరిక్ష విద్య, దాని అనుభవాలను సందర్శించడానికి తక్కువ అవకాశాలు ఉన్న గ్రామీణ పిల్లలకు అందించడం ఎగ్జిబిషన్ లక్ష్యం. ఈ ప్రత్యేక వాహనంలో ఉపగ్రహ నమూనాలు, లాంచ్ వెహికిల్స్ భారత అంతరిక్ష ప్రయోగాల విజయాలు, భవిష్యత్తు ప్రాజెక్టుల వివరాలు, అంతరిక్ష విజ్ఞాన సంబంధిత వీడియోలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఎస్‌సీ సైంటిస్టులు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ టి శంకర్ ప్రసాద్, స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరామావుప్రిన్సిపాల్ కాళహస్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఇవ్వండి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కార్మికుడు, సామాజిక కార్యకర్త అలువాల రాములు కోరారు. కొత్త రేషన్‌కార్డు ఇవ్వాలని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు నుంచి కరీంనగర్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. దారి పొడవునా ఆలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డులు జారీ చేసేలా చూడాలని దేవుళ్లకు మొక్కారు. మంగళవారం కరీంనగర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాములు కొత్త రేషన్‌కార్డు కోసం అనేక సార్లు దరఖాస్తు చేసుకొని విసిగిపోయాడు. తన మాదిరిగా ఎంతో మంది రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోలేక పోతున్నారని, కార్డులు వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరేందుకు పాదయాత్ర చేపట్టానని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు ఇప్పించి, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని కోరారు.

10న ఉమ్మడి జిల్లా అండర్-19 బాక్సింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-19 మెన్ అండ్ ఉమెన్స్ బాక్సింగ్ ఎంపి క పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల బాక్సింగ్ క్రీడాకారులు ఉదయం 10 గంటలకు స్టేడియంలో ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఒక పాస్ పోర్టు ఫొటోతో హాజరు కావాలని, వివరాలకు 9100668474 నంబరులో సంప్రదించాలని ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సంపత్ కుమార్ తెలిపారు.

అందుబాటులోకి ఎల్‌సీ యాప్

లైన్ క్లియర్ అనుమతి నుంచి రిటర్న్ వరకు యాప్‌లోనే



గణేశ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ విని యోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఎస్పీడీసీఎల్ మరో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ ఎల్‌సీ (లైన్ క్లియర్) యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఎల్‌సీ తీసుకుని పని చేసే సమయంలో మానవ తప్పిదాలు జరుగుతున్న నేపథ్యంలో నూతనంగా తీసుకొచ్చిన యాప్ వినియోగదారులకు.. ఇటు ఎస్‌పీడీసీఎల్ సిబ్బందికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలను పెంచేందుకు, విద్యుత్ అంతరాయ సమయాలు, మానవ తప్పిదాలను నివారించేందుకు లైన్ క్లియర్ (ఎల్‌సీ) యాప్‌ను రూపొందించామని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు తెలిపారు.

యాప్ పని చేసే విధానం

విద్యుత్ సరఫరాలో ఎల్సీ తీసుకోవాలనుకున్న లైన్‌మన్ మొదట లైన్ క్లియర్ యాప్ ఓపెన్ చేయాలి. సంబంధిత ఫీడర్లో ఎల్‌సీ కావాలని ఏఈకి మెసేజ్ చేయాలి. ఏఈ లైన్‌మన్ పంపిన మెసేజ్‌ను పరిశీలించి ఆ ఫీడర్లో ఎల్‌సీ ఇవ్వొచ్చా.. లేదా అని, అత్యవసర అవసరాలు ఏమైనా ఉన్నాయా లేదా మరే ఇతర షెడ్యూల్ చేసిన పనులు ఉన్నాయా అని సమీక్షిస్తారు. దాని ప్రకారం ఎల్‌సీ ఇవ్వొచ్చు లేదా నిరాకరించవచ్చు.. ఏఈ ఎల్‌సీ అనుమతి ఇవ్వగానే సంబంధిత లైన్‌మన్‌కు సమాచారం అందుతుంది. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్‌కు ఎల్సీ ఇవ్వాలో యాప్ ద్వారా మెసేజ్ వస్తుంది.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఎల్‌సీ ఇవ్వాల్సిన సమయంలో పొరపాట్లు లేకుండా తగిన సూచనలు, జాగ్రత్తలు హెల్మెట్ పెట్టుకోవడం, హ్యాండ్ గ్లౌజ్ వేసుకోవడం, ఎర్త్‌రాడ్ వాడాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేస్తారా లేదా అని యాప్ గుర్తుచేస్తుంది. వీటన్నింటిని సబ్‌స్టేషన్ ఆపరేటర్ చేసి ఫొటో తీసి యాప్ అప్లోడ్ చేస్తే ఆ ఫొటోను యాప్ ద్వారా లైన్‌మన్ చూసి.. ఆ ఫొటోలో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా.. లేదా.. అని ధ్రువీకరించుకుని పని ప్రారంభిస్తాడు. లైన్‌మన్ ఎంతమంది సిబ్బందితో పని చేయిస్తున్నాడో వారి పేర్లు యాప్‌లో పొందుపర్చాలి. పని పూర్తి కాగానే ఈ పనికి సంబంధించి ఫొటో, సిబ్బంది వచ్చారా.. లేదా అని యాప్‌లో పొందుపర్చి ఎల్‌సీని రిటర్న్ చేయాలి. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా ఎల్‌సీ రిటర్న్ చేయాలని ఆదేశాలు వెళ్తాయి. రిటర్న్ చేసిన ఎల్‌సీ సమాచారం ఏఈకి అందుతుంది. ఏఈ ఆదేశాల మేరకు ఆ ఫీడర్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు.

ప్రమాదాల నివారణ

విద్యుత్ లైన్ క్లియర్‌లో ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్ను ఎంచుకోవడం, పంపిణీ వ్యవస్థ సరిగ్గా గుర్తు చేసుకోకపోవడం, సమాచార లోపం, తదితర కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రిషియన్లు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నివారణ కోసం ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించొచ్చు. అనవసరమైన ఎల్‌సీలు తగ్గించొచ్చు. ఎల్‌సీల సమయాలను గణనీయంగా తగ్గించడమే కాకుండా ఎల్‌సీ తీసుకున్న సమాచారం పైఅధికారులకు వెంటనే తెలిసి పోతుంది. సంబంధిత ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్‌సీలను ఈ యాప్ ద్వారా నివారించొచ్చు.

ముగ్గురికి జీవిత ఖైదు

కరీంనగర్‌లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువకుడి ఆత్మహత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు, రూ. 2వేల చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నీరజ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రామగుండం మండలం మల్రిపల్లికి చెందిన గూండా శంకరయ్య తన కూతురును ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని అదే గ్రామంలోని ఎస్సీ కులానికి చెందిన దొబ్బల పవన్(21)పై కేసు పెట్టాడు. ఆ కేసులో పవన్ జైలుకు వెళ్లి వచ్చాడు. కొన్నాళ్లకు పవన్‌కు వేరే అమ్మాయితో పెళ్లి సంబంధం కుదిరింది. ఈ విషయం తెలిసి 2016 ఆగస్టు 21 మధ్యాహ్నం పవన్ తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్తుండగా గూండా శంకరయ్య, అకినపల్లికి చెందిన మండే శ్రీనివాస్, ఎగ్లాస్పూర్‌కు చెందిన క్యాతం రవీందర్ అడ్డుకున్నారు. బూతులు తిట్టి చనిపో అంటూ అవమానపరిచారు. దీంతో ఇంటికి వచ్చిన పవన్ జరిగిన విషయాన్ని తన తమ్ముడికి చెప్పి రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చనిపోయాడు. ఈ సంఘటనపై పవన్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో రామగుండం పోలీసులు గుండా శంకరయ్య (40), మెండే శ్రీనివాస్(35) క్యాతం రవీందర్(55)పై కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాల పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ముగ్గురికి జీవిత ఖైదు విధించారు.

‘రాజన్న’ ఆలయ విస్తరణకు శ్రీకారం

- 15న వేములవాడకు ఉన్నత అధికారుల రాక
- సమీక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రిత్వ కార్యదర్శి శైలజ రామయ్యార్



మ్యాపులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రిత్వ కార్యదర్శి శైలజరామయ్యార్

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన పనులపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన దేవాదాయ శాఖ మంత్రిత్వ కార్యదర్శి శైలజరామ య్యార్, ఓఎస్‌డీ సోమరాజులు, కమిషనర్ శ్రీధర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం విస్తరణ పనులపై చర్చించారు. ఈనెల 15న దేవాదాయ శాఖ కమిషనర్ ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి వేముల వాడలో పర్యటించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి పర్యటన చేసి మరోసారి శృంగేరీ పీఠం వారి వద్దకు వెళ్లాలని నిర్ణయించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్కిటెక్‌తో తయారు చేయించిన ఆలయ విస్తరణ పనులకు సంబంధించిన నమూనా లను పరిశీలించి కొన్ని మార్పులుచేర్పులు చేసి రెండు రోజుల్లోగా చివరి ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు పీఠాధిపతి సూచనలు తీసుకొని 21న టెండర్ ప్రక్రియ చేపట్టడానికి ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

యోగానంద లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

జూలపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ శివారులోని శ్రీయోగానందా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా ముత్యాల పందిరిని ఏర్పాటుచేసి రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. సన్నాయి మేళతాళాల మధ్య అర్చకులు స్వామి వారల పెళ్లితంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుకలను చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవంలో భక్తులు ఆలపించిన గోవింద నామాలు మారుమోగాయి. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం చలువ పందిరి, తాగునీరు, అన్న ప్రసాదం, పలు సౌకర్యాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. గొట్టిముక్కుల రజనీ, రవిందర్‌రెడ్డి, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, సీపెల్లిగోపాలక్రిష్ణ, సంకెండ్ల లక్ష్మి రాజం, సీపెల్లి అంజి, బొజ్జ సంపత్, మద్దెల నరేష్, కొండపెల్లి క్రిష్ణమూర్తి, గుండు కరుణాకర్, బాలక్రిష్ణ భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్క ర్స్ (ఎస్‌డబ్ల్యుయూ) ఐఎన్‌టీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జక్కుల మల్లేశంగౌడ్ అన్నారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెకు ఇది సరైన సమయం కాదని, సంస్థలోని మిగతా సంఘాలను కలుపుకొని వెళ్లాలని అన్నారు. సమ్మెపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు చొరవ చూపాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్మికులకు పీఆర్సీ 21శాతం అందించిందన్నారు. రావాల్సిన బాండ్ డబ్బులతోపాటు, డీఏ అందించారన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దశల వారీగా పరిష్కరిస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన పనిభారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాల న్నారు. బ్రీత్ అనలైజింగ్ టెస్టుల్లో వస్తున్న దానికనుగుణంగా కార్మికులను తొలగిస్తున్నారని, బీపీ, షుగర్ మందులతో బ్రీత్ టెస్టుల్లో పర్సెం టీజీలు అధికంగా వస్తున్న విషయాన్ని గమనించి కార్మికులకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఆర్టీసీ లాభాల బాటలో ఉన్నందున మొదటి తేదీన జీతాలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలపై స్పందించాలని, లేని పక్షంలో సమ్మెపై తమ సంఘం కూడా ఆలోచన చేయాల్సి వస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజు, రీజినల్ సెక్రెటరీ టీఆర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కుల మల్లేశంగౌడ్

కుటుంబ కలహాలతో ముగ్గురికి కత్తిపోట్లు

బాధితుల్లో మూడేళ్ల బాలుడు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో కుటుంబ కలహాలతో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన కళికోట వెంకటేష్, అతడి అన్న కొడుకు పృథ్వీ మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వెంకటేశ్ అన్న కొడుకు పృథ్వీ, సాయి, మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కలిసి వెంకటేశ్- ఏంజెల్ దంపతులు, వారి కొడుకు శివనేత్ర(3)లపై కత్తులతో దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఇందులో శివనేత్ర పరిస్థితి విషమంగా ఉంది. ఏంజెల్‌కు తీవ్ర గాయాలు కాగా, వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో బాలుడు శివనేత్రను హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పృథ్వీ, సాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. కాగా, గతంలో పృథ్వీ అనే వ్యక్తిపై తాను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడు వెంకటేశ్ మీడియా ఎదుట తన బాధను వ్యక్తం చేశాడు. పోలీసులు పట్టించుకుంటే ఈ సంఘటన జరిగేది కాదని వెంకటేశ్ పేర్కొన్నాడు. తనపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు. కాగా, పోలీసులు స్పందించలేదని వెంకటేశ్ పేర్కొనడం అవాస్తమని సీఐ తెలిపారు.

కాంగ్రెస్‌తో కలిసి పనిచేయకూడదా?

జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి వచ్చిన వలస నాయకుడే

అసహనపు మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయకూడదా అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన వలస నాయకుడేనని, తనపై చేసిన అసహనపు మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విలేకర్లతో మాట్లాడారు. తనపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఘాటుగా స్పందించారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని తాను కాంగ్రెస్‌లో చేరి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని అన్నారు.

సోమవారం సారంగాపూర్ మండలంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాధికారం కోసమే కాంగ్రెస్ ముసుగులో బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని పరోక్షంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను విమర్శించారు. దీనిపై సంజయ్ కుమార్ స్పందిస్తూ తనపై జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి జీవన్‌రెడ్డి ఎంతోమందిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని సంజయ్‌కుమార్ గుర్తుచేశారు. మీరు పార్టీలో చేర్చుకుంటే లేని తప్పు, నేను కాంగ్రెస్‌లో చేరితే ఎలా తప్పు అవు తుందని జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రశ్నించారు. జగిత్యాల ప్రజలకు ఎవరు వలస వచ్చిన నాయకుడో తెలుసునని అన్నారు. తాను చేసిన అభివృద్ధితోనే రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందానని ఎమ్మెల్యే అన్నారు. సీనియర్ నాయకుడిగా జీవన్‌రెడ్డిని గౌరవిస్తానని, తన గౌరవాన్ని కాపాడుకుంటే మంచిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించండి

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్



కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నేతకార్మికుల సమస్యలను పరి ష్కరించాలని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ కోరారు. ఈ మేరకు ఆయన కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి చేనేత కార్మికుల సమస్యలను వివరించారు. వాటిని పరిష్క రించేందుకు కేంద్ర జౌళిశాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సంజయ్ చేనేత కార్మికుల సంక్షేమం, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, ఢిల్లీకి వస్తే తప్పకుండా కేంద్రజౌళిశాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించి, పరిష్కారానికి సహకరిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి సాను కూలంగా ఉందని చెప్పినట్లు వీరమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలిగేటి శ్రీనివాస్, మహిళా విభాగం కోశాధికారి భీమనాతి శారద పాల్గొన్నారు.అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్‌ని శాలువతో సత్కరించారు.



ఆలయ ఆవరణలో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

వేలాదిగా అంజన్నను దర్శించుకున్న దీక్షాపరులు

మల్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. కాగ హనుమాన్ చిన్న జయంతి సమీపిస్తుండడంతో వేలాదిగా సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న అంజన్న దీక్షాపరులు వేకువజామునే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చు కున్నారు. ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

బద్ది పోచమ్మకు బోనాలు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలు, పిల్లాపాపలను చల్లగా చూడమ్మ బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. వేముడవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ బద్దిపోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారికి మట్టికుండలో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు.



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

అన్నదాతకు వాన భయం

- ముందస్తు వరి కోతలు - ధాన్యం కాపాడుకునేందుకు తిప్పలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను వాన భయం వెంటాడుతోంది. అకాల వర్షాలతో పంట చేతికి వస్తుందో.. రాదోననే ఆందోళనతో ముందస్తుగా యాసంగి వరి కోతలు ప్రారంభించారు. ఈ నెల చివరి వారంలో కోయాల్సిన వరి కోతలు మొదలు పెట్టారు. సాగు నీటి కొరత దృష్ట్యా సీజన్‌లో ముందుగా వరి నాట్లు వేసిన రైతులతోపాటు అకాల వర్షాలు పడే అవకాశముందనే భయంతో మరి కొందరు రైతులు అప్రమత్త మవుతున్నారు. గత నెలలో కురిసిన అకాల వర్షానికి వరి, మొక్క జొన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. అధికారికంగా 115 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లిందని, 15 ఎకరాల్లో మొక్క జొన్న పంట దెబ్బతిన్నదని అధికారులు పేర్కొన్నారు.


వరి కోస్తున్న హార్వెస్టర్

రెండు రోజుల క్రితం కూడా చిరుజల్లులు రైతులను ఆందోళనకు గురి చేశాయి. మరోవైపు కోసిన పంటను కాపాడుకునేందకు కూడా తంటాలు తప్పడం లేదు. ఈనెల చివరిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకానున్నాయి. అప్పటి వరకు పంటలను కాపాడుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కరీంనగర్ మండలంలో యాసంగిలో మొత్తం 13వేల 200 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రభుత్వం సన్నాలకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తుండడంతో 2వేల ఎకరాలకు పైగా సన్నాలు, మిగతా 11 వేల ఎకరాల్లో దొడ్డు రకం సాగు చేశారు. మొత్తం 20వేల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచన వేస్తున్నారు. నగునూర్, చానమపల్లి, మొగ్దుంపూర్, ఇరుకుల్ల, దుబ్బపల్లి, చెర్లబూత్కూర్, ఎలబోతారం, దుబ్బపల్లిలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

● న్యూస్‌బాక్స్

నేడు పీఏసీఎస్ వార్షిక మహాసభ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వార్షిక మహాసభను బుధవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి నేతి వేణు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సంఘ ఆవరణలో నిర్వహించనున్న మహా సభకు డైరెక్టర్‌లు, సభ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు.

హార్వేస్టర్ నిర్వాహకులతో సమావేశం

భగత్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం హార్వేస్టర్ నిర్వాహకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. వచ్చే పది రోజుల్లో మండలంలో వరి పంట కోతకు వచ్చే నేపథ్యంలో ఆపరేటర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసిజర్ (ఎస్‌ఓపీ) ప్రకారం నడిపించాలన్నారు. తహసీల్దార్ రాజేశ్, మండల వ్యవసాయాధికారి కృష్ణ, ఏఈవో రాము, రాజేంద్రప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.

నేడు 'మనసెందుకో సున్నితం' పుస్తక పరిచయ సభ

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 8: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు ఫిలింభవన్‌లో బిట్ల అంజనీదేవి రచించిన 'మన సెందుకో సున్నితం' పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల విద్యాసంస్థల జాయింట్ సెక్రెటరీ జీవి శ్యాంప్రసాద్‌లాల్, అతిథులుగా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార సంస్థ చైర్ పర్సన్ కె.శ్రీలత, సాహితీ వేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

జ్యోతీనగర్ ఎస్‌ఆర్‌డీజీ స్కూల్‌లో పొరండ్ల రాజేశం రచించిన 'భావ తరంగాలు' కవితా సంపుటి, 'పెరల్స్ ఆఫ్ విజ్‌డమ్' ఆంగ్ల సూక్తుల పుస్తకాలను బుధవారం ఆవిష్కరించ నున్నట్లు శరత్ సాహితీ కళా స్రవంతి ఉపాధ్యక్షుడు వాసం శివనారాయణ ప్రకటనలో తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దళితబంధు రెండో విడత నిధులను వెంటనే మంజూరు చేయాలని దళితబంధు సాధన సమితి సభ్యులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇల్లందకుంట మండలంలో తప్ప ఎక్కడా వెరిఫికేషన్ మొదలు పెట్టలేదన్నారు. దీంతో హుజూరాబాద్‌లో ఉన్న బాధితులు అయోమయానికి గురవుతున్నారన్నారు.

పూలే జయంతికి సెలవు ప్రకటించాలి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పూలే జయంతి సందర్భంగా ఏప్రిల్ 11వ తేదీని సెలవుగా ప్రకటించాలని, జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించాలని పూలే బీసీ సంక్షేమ సంఘం, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కరీంనగర్ జ్యోతిబా పూలే సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహాత్మా జ్యోతి బాపూలే 198వ జయంతి ఉత్సవాలను ఏప్రిల్ 11న ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నా ప్రచారం, సెలవు దినం లేకపోవడంతో ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరు కాలేకపోతున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోటేష్ కుమార్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దెతోటల పెంపకంపై ఆసక్తి చూపాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మిద్దెతోటలపై ఆసక్తి చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మంగళవారం కిసాన్‌నగర్‌లో పర్యటించారు. మిద్దె తోటలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మిద్దె తోటల పెంపకం చేపట్టిన మహిళలను కమిషనర్ అభినందించారు. ఇంట్లో ఉత్పత్తి అయ్యే తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి, మెప్మా సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ చాహత్‌బాజ్‌పాయ్

● నగరంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగం, పారిశుధ్య విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం కోసం అనువైన ప్రదేశాన్ని గుర్తించి, టెండర్లు పిలవాలన్నారు.

● ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష నిర్వహించారు.

చామనపల్లి ఆరోగ్య కేంద్రం సేవలు అభినందనీయం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చామనపల్లి ఆరోగ్య కేంద్రం సేవలు అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ కొనియాడారు. మంగళవారం కరీంనగర్ మండలం చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆశా వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఓఎంసీహెచ్ డాక్టర్ సన జవేరియా, చామనపల్లి వైద్యుడు డాక్టర్ మనోహర్, పీహెచ్‌ఎన్ విమల తదితరులు పాల్గొన్నారు.


సమావేశం నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

మౌలిక వసతుల పరిశీలన

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలులో మౌలిక వసతులను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్ మంగళవారం పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి భోజనం, యోగక్షేమాలు, న్యాయ సేవలు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ఆసక్తి కలిగిన ఖైదీల వివరాలు తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్ విజయ్‌డేని, జైలర్లు పి.శ్రీనివాస్, కె.రమేష్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎల్.రమేష్ పాల్గొన్నారు.

11న కొత్తపల్లి వారసంత వేలం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తపల్లి వారసంత వేలాన్ని ఈనెల 11న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ ప్రకటనలో తెలిపారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు మార్కెట్ ఫీజు వసూలు చేసే కాంట్రాక్టు కోసం వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించాల్సిన వేలాన్ని అనివార్య కారణాలతో 11వ తేదీకి వాయిదా వేశామని, ఔత్సాహికులు 25వేల డిపాజిట్ మొత్తాన్ని కార్యాలయంలో చెల్లించాలని సూచించారు.

29న చిరుతల భజన ప్రపంచ రికార్డు ప్రదర్శన

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 8: కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 29న చిరుతల భజన ప్రపంచ రికార్డు ప్రదర్శన నిర్వహించనున్నారు. మంగళవారం కళాభారతి ఆవరణలో నిర్వాహక బృందాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జి.కృపాదానం, బి.గోపాలరావు మాట్లాడుతూ కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, హుజురాబాద్ కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి కళాభారతి ప్రాంగణంలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లా కళాకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చిరుతల భజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో చిరుతల భజన నిర్వాహకులు, కళాకారులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టనున్న మరమ్మతుల్లో భాగంగా బుధవారం పలు ప్రాంతాల్లో వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టూ ఏడీలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 వరకు శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, సప్తగిరి కాలనీ, తాహెరా మసీదు ఏరియా, అంజనాద్రి ఆలయ ప్రాంతం, దోబీఘాట్ ఏరియా, గోదాం ప్రాంతం, బీఎస్‌ఎఫ్ క్వాటర్స్ ఏరియాల్లోనూ, ఉదయం 10 గంటల నుంచి 11:30 వరకు హౌసింగ్ బోర్డ్ కాలనీ, విట్స్ కాలేజ్, సుభాష్ బొమ్మ,(రోడ్ నెం 1నుంచి 6) బొమ్మకల్ రోడ్, వరాహస్వామి టెంపుల్ ఏరియాలోనూ, మధ్యాహ్నం 12 నుంచి 1:30 వరకు మారుతినగర్, పాతబజార్, వెంకటసాయి థియేటర్ రోడ్డు, కాపువాడ అశోక్‌నగర్, గౌరీశంకర్ కాంప్లెక్స్ అశోక్‌నగర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

'విప్రో'కు ఎంపికైన అల్ఫోర్స్ విద్యార్థిని

భగత్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విప్రో సంస్థ నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రాంకి అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని కొంక వైష్ణవి ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైష్ణవి విప్రోలో స్కాలర్ ట్రైని ఉద్యోగంతోపాటు, ఉన్నత విద్యాభ్యాసానికి స్కాలర్‌షిప్‌ను గెలుచు కుందన్నారు. కళాశాలలో విద్యార్థినులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినులు ఉద్యోగాల ఎంపికలో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను 50 రూపాయలు పెంచడంతో సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని, తక్షణమే పెంచిన ధరను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దోపిడీ, మోసానికి మోదీ ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నదని, చివరకు గ్యాస్ సిలిండర్లను సైతం విడిచిపెట్టడం లేదని మండిపడ్డారు. వంట గ్యాస్ ధరను పెంచడంతో పేద కుటుంబాలకు మరింత నష్టం కలుగుతుందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించక పోవడం దారుణమని పేర్కొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి మృతి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వెంగళదాసు నారాయణ(100) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు వారం రోజుల క్రితం బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. నారాయణ 20 సంవత్సరాలు బొమ్మకల్ సర్పంచ్‌గా కొనసాగారు.


నారాయణ(ఫైల్)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సన్మానం

భగత్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నియోజక వర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్యను హైదరాబాద్‌లోని కార్యాలయంలో మంగళవారం బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, కర్ర ప్రభాకర్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, బొంగోని పర్శరాములు తదితరులుపాల్గొన్నారు.

స్పాట్ విధుల నుంచి తప్పించండి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఇతర కారణాలతో విధులు నిర్వహించలేమని అభ్యర్థించిన వారిని పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం(స్పాట్) విధుల నుంచి మినహాయించాలని, స్పాట్‌పై ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులకు అప్పగించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ కోరారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదోతరగతి స్పాట్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంకె రాంచంద్రారెడ్డి, వేల్పుల బాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్ అర్కాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

మానకొండూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న రజతోత్సవ సభ జరుగుతుందన్నారు. నియోజకవర్గం నుంచి సుమారు 15వేల మంది వరకు సభకు తరలిస్తామని తెలిపారు. మాజీ జడ్పీటీసీలు తాల్లపల్లి శేఖర్‌గౌడ్, సిద్దం వేణు, శ్రీనివాస్‌రెడ్డి, శాతరాజు యాదగిరి ఉన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

గంగాధర (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ చొప్పదండి నియోజకవర్గ సన్నాహక సమావేశం బుధవారం కురిక్యాల శివారులోని శుభమస్తు ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

రామడుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలో హనుమాన్ శోభాయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాపరులు గ్రామంలోని అన్ని వీధులగుండా శోభాయాత్ర డప్పుచప్పుళ్లు, నృత్యాల మధ్య కొనసాగించారు.

భూముల కబ్జాపై ఇరిగేషన్ ఈఈకి ఫిర్యాదు

హుజూరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిలుకవాగు భూములను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య మంగళవారం ఇరిగేషన్ ఈఈకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ వారం రోజులుగా కబ్జాలపై ఫిర్యాదు చేస్తున్నప్పటికీ జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి కొలతలు వేయడం లేదన్నారు. చిలుకవాగు హద్దుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. కబ్జాలపై ఇక్కడి అధికారులతో సమీక్షలు జరపకుండా స్వయంగా జిల్లా కలెక్టర్ సందర్శించి, విచారణ జరిపి కబ్జాలకు గురైన భూములను రికవరీ చేయాలని కోరారు.

'అల్ఫోర్స్'లో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

రామడుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి హాజరై చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో కలిసిరావాలి

ఇల్లందకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో ప్రతిఒక్కరూ కలిసిరావాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సూచించారు. మంగళవారం మండలంలోని శ్రీరాములపల్లి గ్రామం నుంచి ఇల్లందకుంట వరకు జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్ (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని 23వ వార్డులో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రం సతీష్‌రెడ్డి, పొనగంటి మల్లయ్య, మొలుగూరి సదయ్య, గూడెపు సారంగపాణి, పొనగంటి రాము, దేశిని సదానందం, సాయిని రవి పాల్గొన్నారు.

మానకొండూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంషాబాద్, గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, నిజాయితీగూడెం, పెద్దూరుపల్లి గ్రామాల్లో నిర్వహించిన పాదయాత్రలో నాయకులు రవీంద్రాచారి, సమ్మయ్య, కుమార్, బక్కారెడ్డి, కొమురయ్య ఉన్నారు.


చిగురుమామిడి మండలం ఉల్లంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిగురుమామిడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతరాంపూర్, ఉల్లంపల్లి గ్రామాల్లో గ్రామాల్లో నిర్వహించిన పాదయాత్రలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, నాయకులు కానవేణి శశికుమార్, సుధగోని రాజేంద్రప్రసాద్, మల్లయ్య, కొత్తపల్లి సత్యనారాయణ, జగన్నాథం పాల్గొన్నారు.

వీణవంక (ఆంధ్రజ్యోతి): మండలంలోని లస్మక్కపల్లి, కొండపాక, రామకృష్ణపూర్, హిమ్మత్‌నగర్, శ్రీరాములపేట గ్రామాల్లో జరిగిన పాదయాత్రలో మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు గెల్లు శ్రీనివాస్, గంగాడి తిరుపతిరెడ్డి, చినాల అయిలయ్య, పైడి కుమార్ పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్ (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని నాకాచౌరస్తా నుంచి 4, 5, 26, 27, 28 డివిజన్ల మీదుగా సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంవిధాన్ యాత్ర నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నాయకులు ఎండీ తాజ్, కర్ర రాజశేఖర్, కమ్రొద్దీన్, షబానామహ్మద్, దన్నాసింగ్, బషీర్, జీడీ రమేష్, జమీల్, జాఫర్, అనిల్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరుకుల్లలో జరిగిన యాత్రలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మానకొండూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ డీలర్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నారం, ఖాదర్‌గూడెం, గంగిపల్లి, మానకొండూర్, పచ్చునూర్, శంషాబాద్, పెద్దూరుపల్లి, నిజాయితీ గూడెం గ్రామాల్లోని అర్హులైన వారు ఈ నెల 12 వరకుతి దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

స్కూల్ బ్యాగ్స్ అందజేత

చిగురుమామిడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుమామిడి, ముల్కనూర్ గ్రామాల్లో గల పౌల్ట్రీ ఫామ్స్ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన 25 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను, స్టడీ మెటీరియల్ ను మంగళవారం అందించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులకు కలెక్టర్ పమేలా సత్పతి స్కూల్ బ్యాగులతో పాటు స్టడీ మెటిరియల్‌ను పంపించగా తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీడీవో బాస మధుసూదన్, మండల విద్యాధికారి పావని పంపిణీ చేశారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రబియా బస్రి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్నకొండ-రాగంపేట రోడ్డుకు మరమ్మతు


రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న నాయకులు

చొప్పదండి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ, రాగంపేట గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ పూడ్చి బాగు చేయించారు. రోడ్డుపై గుంతలతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్డుపై గుంతలను పూడ్చి బాగు చేయించాలని మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్‌ను ఆదేశించారు. వెంటనే మార్కెట్ చైర్మన్ స్పందించి తన సొంత ఖర్చులతో ఆర్నకొండ-రాగంపేట గ్రామాల మధ్య ఏర్పడిన గుంతలను 40 ట్రిప్పుల మొరాన్ని పోసి ట్రాక్టర్‌తో చదును చేయించారు.

గ్యాస్ ధర పెంపుపై సీపీఐ నిరసన

శంకరపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలపై మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేశవపట్నం అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు గ్యాస్ సిలిండర్‌ను ఆటోపై పెట్టి ఆటోకు తాడు కట్టి లాగుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోదారి లక్ష్మణ్, భిక్షపతి, మొగిలి, కుమార్, పోచయ్య, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట ఎంపీడీవో భీమాసేనాకు తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయి వేతనాలు చెల్లించాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. పంచాయతీ సిబ్బందిని రెండో పీఆర్సీలోకి తీసుకోవాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల ఆటల పోటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ నెల 28న బహుమతుల ప్రధానోత్సవం జరగనుందని తెలిపారు.

● సంక్షిప్తం..

గన్నేరువరం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలలో జిల్లా వెటర్నరీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రేబిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈవో రామయ్య, వెటర్నరీ డాక్టర్లు సురేందర్, సాంబరావు, హెచ్‌ఎం సాయిశిరీష, పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో రేకుర్తి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సౌజన్యంతో సుమారు 150 మందికి కంటి పరీక్షలు చేయించారు.

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న మురళీ కృష్ణ సతీమణి మృతిచెందగా గ్రామస్థులు 50 వేల రూపాయల విరాళాలను సేకరించి అంత్యక్రియలను నిర్వహించారు.

చొప్పదండి మండలంలోని రాగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతు లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కర్ర వెంకటరాంరెడ్డి పాల్గొన్నారు.

జమ్మికుంట: విద్యార్థులు పుస్తక పఠనం చేయడం వల్ల మేధో వికాసం పెరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ కుమార్ అన్నారు.

హుజూరాబాద్: వాణిజ్య పనుల శాఖలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు వెంటనే బదిలీలు చేపట్టాలని టీసీటీ ఎన్జీవోస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ హుజాహిద్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని పాకాల సంజన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్‌ను సాధించగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా అందుకుంది.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సుష్మిత అల్ఫోర్స్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో 10వ ర్యాంకు సాధించింది.

చిగురుమామిడి: ఒలింపియాడ్ పరీక్షలో మండలంలోని చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థిని జెల్ల వైష్ణవి యాదవ్ ప్రతిభ కనబరిచింది.